# 'నూతన సంవత్సర శుభాకాంక్షలు'

-శ్రీనివాసరాజు

"పయనిగళిన్ కనివాన గవనిత్తిర్కు..

చెన్నై సెంట్ర లిరిందు హైదరాబాద్ వరైసెల్లుమ్ హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ పొన్నుం పట్రు నేరత్తిల్ పత్తా వరు ప్లాట్‌ఫారత్తి లిరిందు పురప్పడుం"

చెన్నై సెంట్రల్‌లో హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో కూర్చున్న నాకు వాచీ చూసుకోవడమే పెద్ద పనిగా వుంది.

ఏం పురప్పడడమో! ఇప్పటికెన్నిసార్లిలా అనౌన్స్ చేయడం? చిరాకేస్తోంది. మనకి చిరాకేస్తే బండి బయ ల్దేరుతుందా? దానికీ ఓ టైముంటుందిగా. ఆ టైమ్ వరకూ వెయిట్ చేయాలిగా. అవసరమైతే ఇంకా కూడా వేచి వుండాల్సుంటుంది. వేచి వుండడం.. మనకిష్ట మున్నా, లేకున్నా జీవితంలో ఓ భాగం. అవసరం కూడా. పేషన్స్ ఆల్వేస్ పేస్. నిజం కూడా.

డిసెంబర్ 31 కావడంతో చెన్నై సెంట్రల్ స్టేషన్ అంతా నూతన సంవత్సరపు హడావుడి. బంధు మిత్రుల్ని చూడ్డానికి ఎంతో ఆతృతతో ప్రయాణమవు తున్న జనం. సెంట్రల్‌నీ, ప్రక్కనే వున్న దక్షిణ రైల్వే ప్రధాన కార్యాలయాన్నీ, ఎదురుగా వున్న జనరల్ హాస్పి టల్‌నీ అంతా కమ్మేసినట్టున్న పండుగ వాతావరణం. నూతన సంవత్సరపు వేడుకల కోలాహలం.

రైలు బయల్దేరడంతో కాస్త రిలీఫ్‌గా వుంది. మెల్లగా బేసిన్ బ్రిడ్జి జంక్షన్, కొరుక్కుపేట, తండయార్ పేటల్ని దాటుకుంటూ ఓ అరగంటలో ఎన్నూరు క్రీక్‌మీదుగా ట్రెయిన్ పోతోంటే, బంగాళాఖాతం మీంచి వీచే చల్లటి గాలి సేదతీరుస్తున్నట్టుగా వుంది.

జేబులోంచి ఉత్తరం తీసి చదువుతున్నా.

అప్పటికది ఏ పదిహేడోసారో... అంతటి ఆత్మీయత.

'అనంతమైన ఆశీస్సులతో...' అమ్మ.

ఉత్తరం ముగించా.

'ఛాయే.. ఛాయే' బండిలో టీవాడి టీ గోల.

ఎవరి గోల వారిది. ఎవరి పని వారిది.

అందరూ వాళ్ళ వాళ్ళ పనులు సక్రమంగా చేసుకుపోతుంటేనే ప్రపంచమంతా సజావుగా సాగిపోతుంటుంది.

ఛాయ్ సిప్‌చేస్తుంటే... ఆలోచనల అలల్లోకి అలవోకగా... అమ్మ. ఎనభై ఏళ్ళయ్యాయ్. అయినా అలా వుండదేం! వయసు శరీరానికే గానీ మనసుకి కాదన్నది అమ్మని చూస్తే నిజమేననిపిస్తుంది. అందుకు నిలువెత్తు సాక్ష్యం అమ్మ. అమ్మ గుంటూర్లో వుంటోంది ఒంటరిగా... స్వతంత్రంగా.

కొంత మందికి వందల మంది మధ్య వున్నా...

ఇంకొందరికి ఒంటరిగా వున్నా... వందల మంది మధ్య వున్నట్టుగానే వుంటుంది. అమ్మ రెండో రకం.

ఇదంతా మన జీవన విధానం మీదే ఆధార పడుంటుంది.

## ఆ నవ్వు వెనుక...

అబిడ్స్‌లో కనిపించింది నాకొక అన్యదేశ సుందరి
నాంపల్లిలో నన్ను చూసి సన్నగా నవ్వింది
చిక్కడపల్లిలో కనిపించినప్పుడు చిరునవ్వులు చిందించింది
ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద రేపు కలుసుకుందాం రా అని పిలిచాను
మరుసటి రోజు మసాబ్ ట్యాంక్ వద్ద పేలిన మానవ బాంబు
చూస్తే నా మనసు దోచిన, కాదు మతిపోగొట్టిన సుందరి.

ఆస్తి విభజన కోరిన
మా అన్న
మరో మహ్మద్ ఆలీ జిన్నా

మొన్న మనోహర్
నిన్న కన్నయ్య
నేడు దామోదర్
ఈ శాడిస్ట్ ప్రేమికుల పైత్యం వదిలేదెప్పుడు
తమ వెంటపడి వేధిస్తున్న
పిశాచ ప్రేమికులపై అమ్మాయిలు
ఆసిడ్ కుమ్మరించినప్పుడు
వేట కొడవలితో వేటు వేసినప్పుడు.

-నీలం వెంకటగిరి

కాస్త మనసుని ఫైన్ ట్యూన్ చేయడమే.

ఉదయం మార్నింగ్ వాక్‌తో ప్రారంభమయ్యే రోజు, తోటపని, చుట్టుప్రక్కల వుండే పేద పిల్లల్ని చేరదీసి చదువు చెప్పడం, ఆ ప్రాంతంలో వుండే అమ్మాయిలకి కుట్లు, అల్లికలు నేర్పడం, సంగీతపు క్లాసులు, సాహితీ చర్చలు.. మిత్రులతో కబుర్లు... ఒకటేంటి! రోజెలా గడిచిపోతుందో తెలియదు. అంత బిజీగా తనని తాను తయారు చేసుకొని ముందుకి సాగిపోతుంటుంది అమ్మ. పిల్లల దగ్గర వుండడం కన్నా అమ్మకిదే హాయిగా వుంటుంది. ఎంతోమంది అను

## అక్షరాలు

అక్షరాలకి
పక్షపాత వుండదు
రాసేవాడి శక్తిలో
నిష్పక్షపాతంగా ఇమిడిపోతాయి
ఆలోచనలకి అనుగుణంగా
రూపాన్ని దిద్దుకుంటాయి
చూపులతో గుచ్చి,
నాలుకపై వేసుకున్నప్పుడు-
మనిషిని
అనుభూతుల ప్రవాహంలోకి నెట్టి
నెచ్చెలి సిగలో మల్లెపూవులై
మందహాసం చేస్తాయి
ఒక్కోసారి, కళ్ళల్లో
చింత నిప్పుల్ని పుట్టిస్తాయి
జలధారల్నీ ఒలికిస్తాయి
ఆయుధమై
అవినీతి మీదికి వురుకుతాయి
ఆత్మపరిశీలన కోసం
హృదయ వేదిక మీద
కొత్తదారులు తెరుస్తాయి
చైతన్యం నింపుతున్న
అక్షరాలివి
లక్ష్యాలను ఛేదించగల
అక్షరాలివి
అక్షరమా
శిరస్సు వంచి మ్రొక్కుతున్నాను.

**-యస్. ఆర్. పృథ్వి**

కొనేలా "ఏదో తెల్లవారింది. ఇంకోరోజు.. ఉదయం.. మధ్యాహ్నం.. రాత్రి.. ప్చ్.. మళ్ళీ మరో రోజు. ఇలా వుండదు అమ్మ లైఫ్ స్టైల్.

అమ్మకి ప్రతిరోజూ ఓ అందమైన రోజే, ఓ అద్భుతమైన రోజే.

సూర్యోదయం శుభోదయం చెబుతూ "ఇవ్వాళ మరో అద్భుతమైన రోజుని గడపబోతున్నావ్. ఎంతో మంది మంచివాళ్ళని, అద్భుతమైన వ్యక్తుల్ని కలుసుకోబోతున్నావ్. జీవితపు వేడుకలో మరో అందమైన రోజు నీ కోసం వేచి చూస్తోంది.. లేచి చూడు" అన్నట్టుగా వుంటుందట అమ్మకి.

ఆ సూరీడు అందరి బుర్రల్లో దూరి ఇలాగే చెబితే ఎంత బావుణ్ణు! అంటే హాయిగా నవ్వేస్తుంది అమ్మ.

"సూరీడు అందరి బుర్రల్లోకి రావడం కాదు. అందమైన సూర్యోదయాన్ని చూసి... ఆ శుభోదయాన్నీ.. గడపబోతున్న మరో మంచి రోజునీ... కలుసుకోబోతున్న అద్భుతమైన వ్యక్తుల్నీ... ఇలా వియ్ హావ్ టు విజువలైజ్ అండ్ ఫీల్ ఇట్" అంటుంది.

అమ్మ తెలుగు మాట్లాడుతున్నట్లే మాట్లాడుతూ ఆంగ్లంలోకి వెళ్ళిపోతుంటుంది. అలవాటు. కొన్ని అనుభూతుల్ని వ్యక్తీకరించడానికి ఇంగ్లీష్ బాగా ఉపయోగపడుతుందేమో! 'థాంక్స్' అంటే సులువుగా వుంటుంది. అదే 'కృతజ్ఞతలు' అనో, 'ధన్యవాదములు' అనో అనాలంటే కాస్త ఇబ్బందిగానో, కృతకంగానో వుండొచ్చేమో.

లేక మనకి అలవాటు లేకపోవడమా!

ఏదేమైనా తెలుగువాడికి, తెలుగుదనానికీ, తెలుగు భాషకీ వున్న అడాప్టబిలిటీకి జోహార్లు. ఎన్ని భాషల్లోంచి ఎన్నెన్ని పదాలొచ్చి అవి మన తెలుగే అన్నంతగా కలసిపోయాయ్! నిజంగా దేశ భాషలందు తెలుగు లెస్స. మాతృభాష మీద ప్రేమాభిమానాలు వుండాలే గానీ, పిచ్చి వుండకూడదు. అలాగే అన్య భాషల్నీ ప్రేమించగలగాలే గానీ ద్వేషించేలా వుండకూడదు.

పిచ్చంటే గుర్తుకొస్తోంది, ప్రక్కనున్న తమిళనాట ప్రతీ ఆంగ్ల పదానికీ వెంటనే ఓ తమిళ పదం పుట్టుకొస్తుంది. బస్‌ని 'పేరుందు' అనీ, కంప్యూటర్‌ని 'కనని' అనీ, టెలిఫోన్‌ని 'తొలైపేసి' అనీ, క్యాసెట్‌ని 'ఒలినాడా' అనీ... ఇలా ఒకటేంటి... అన్నీ తమిళ పదాలే. ఏదో మాటవరసకి కాదు... నిత్య జీవితపు వాడకంలో కూడా..

బండి సూళ్ళురుపేట సమీపిస్తోంది. దూరంగా షార్ సెంటర్ వారి క్వార్టర్స్. భారతదేశం గర్వించదగ్గ

ప్రతిష్ఠాత్మకమైన ఉపగ్రహ ప్రయోగ కేంద్రం హైయాల్టి ట్యూడ్ రేంజ్ వుండే శ్రీహరికోటకి ఇక్కణ్ణుంచే వెళ్ళాలి.

'మసాలావడ.. మసాలావడ'- వడలవాడి వేడి అరుపుల్ని కాదన్లేకపోయాను. చిన్న కుదుపుతో బండి కదిలింది.

ఆదివారం అయితే అమ్మ ఫోన్ చేస్తుంది. అమ్మతో మాట్లాడుతోంటే ఆ ఫోన్ తీగలోంచి ప్రేమ, వాత్సల్యం, ఆత్మీయతలు ప్రవహిస్తూ నన్ను తాకుతున్నట్టుగా వుంటుంది. వారం రోజుల కబుర్లు... రోజులెలా గడుస్తోంది. వాళ్ళ మిత్రమండలి... మొక్కల పెంపకం... సాహితీ కథనాలు.. ఒకటేంటి! కాదేదీ కవితకనర్హం లాగా... అలా దొర్లిపోతాయ్ కబుర్లు. నాతోనే కాదు, మా ఆవిడ అంజన, పిల్లలు సుషమ, సంఘమిత్రలతో కూడా..

"ఈ రోజుల్లో కూడా ఇంతటి ఆప్యాయతల్ని పంచే మీలాంటి వాళ్ళ పరిచయం నా అదృష్టం బాబూ" అంటుంది అమ్మ.

"అదేం కాదు... ఇది మా భాగ్యం" అంటాన్నేను.

ఆశ్చర్యపోతున్నారా!?

ఎల్లల్లేనిది తల్లి ప్రేమ. అదో గొప్ప భావన.

"కడుపున పుడితేనేనా బిడ్డ.. నన్నూ మీ అబ్బాయినే అనుకోండి" అంటే "అంతకంటేనా" అంది అమ్మ. అలా మా పరిచయం. ఇప్పుడిలా గుంటూరు ప్రయాణం.

'జగతి' పుస్తక సమీక్షలో 'లావణ్య- ఎ గిఫ్టెడ్ లైఫ్' పుస్తక పరిచయం. ఓ పుస్తకం పంపమంటూ రాయడం.. రావడం.. చదవడం.. లావణ్య ఓ ఇంటెలెక్చువల్.. అంతకు మించి ఓ గొప్ప స్నేహశాలి, ఇతరుల సంతోషాల్నీ, సంబరాల్నీ, ఆనందాల్నీ అన్నీ తనవే అనుకొని సహాయపడే ఓ మంచి వ్యక్తిత్వం... ముప్ఫయిల్లోనే ముగిసిన జీవితం.. ఆర్ద్రమైన హృదయంతో లావణ్య అమ్మగారికి - ఇప్పుడు నాకూ అమ్మే, లావణ్య పుట్టినేడాదే నేనూ పుట్టా- ఓ ఉత్తరం. అలా పరిచయమైన పరిచయం.. ప్రేమాభిమానాలూ, ఆత్మీయతానుబంధాలూ, వాత్సల్యాలతో వర్ధిల్లుతూ...

ఇతరుల్ని సంతోషంగా ఉంచడం నిజంగా మనకెంత సంతోషాన్నిస్తుంది! ప్రేమని పంచడం, ప్రేమని పొందడం ఎంత గొప్ప విషయం. ప్రేమ ఇచ్చిన ప్రేమ వచ్చును. ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును అని మహాకవి ఎప్పుడో అన్నమాటలేగా..

మనుష్యులందరి మధ్యా, దేశాల మధ్యా, స్నేహ

## ఋణానురాగం

**త**ల్లినుండి / విడివడి భూమ్మీద పడిన
శరీర శకలం పేరు / శిశువు.
శిశువెదిగి / మగాడై
తన వామార్ధంలో
గుదిగుచ్చుకొన్న / నిండు శరీరం పేరు
భార్య.
దక్షిణ వామార్థ
దాంపత్య ఫలం పేరు
బిడ్డ.
తల్లికి తీర్చేది ఋణం.
భార్యతో పంచుకొనేది రాగం.
బిడ్డకు పంచిచ్చేది అనురాగం.

-వరిగొండ కాంతారావు

భావం, ప్రేమ, మానవత్వం వెల్లివిరిస్తే ఎంత బావుణ్ణు.

ప్రపంచమంతా ఒకే కుటుంబం. అందరి పెదాల మీద చిర్నవ్వులు.. గుండెల్నిండా ప్రేమాభిమానాలు.

రైలు గుంటూరు సమీపిస్తోంటే ఏదో తెలియని ఉద్వేగం. అమ్మని మొదటిసారి చూడబోతున్నామన్న ఆతృతేమో! హైదరాబాద్‌లోని అమ్మవాళ్ళ పెద్దమ్మాయ్ క్రాంతిరేఖ, అబ్బాయ్ జయంత్ వాళ్ళు అమ్మని వాళ్ళతో బాటే వుండిపొమ్మన్నా అమ్మ గుంటూరునే ఇష్టపడుతుంది. స్వతంత్ర జీవనం. ప్రపంచం నూతన సంవత్సరంలోకి అడుగుబెట్టిన పది నిమిషాల్లో బండి గుంటూరు చేరుతుంది. నూతన సంవత్సరం రోజున అమ్మని చూసి.. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పిన క్షణం అనిర్వచనీయ అనుభూతుల్ని పంచుతుంది.

ఈ నూతన సంవత్సర శుభాకాంక్షలు
అమ్మకేకాదు.. సకల మానవాళికీ...

అసూయా ద్వేషాలు, పగ ప్రతీకారాలు, కార్పణ్యం కాఠిన్యాల స్థానంలో ప్రేమ, స్నేహం వెల్లివిరియాలని మనసు ఉవ్విళ్ళూరుతోంది.

ఈ నూతన సంవత్సర శుభాకాంక్షలు అమ్మకే కాదు.. ప్రేమని ప్రేమించే, స్నేహాన్ని వాంఛించే సకల మానవాళికీ, మన 'పత్రిక'లోని ప్రతి ఒక్కరికీ...

గుండెల్నిండా స్నేహంతో.. హృదయం నిండా ప్రేమతో నూతన సంవత్సర శుభాకాంక్షలు.

■